ఏయ్.. నీయమ్మ.. తోలు తీస్తా.. నా కొడకా..

- రేయ్ బయట తిరగవ్ బిడ్డా..
- సభలో దానం నాగేందర్ బండ బూతులు
- 'అంతు తేలుస్తా' అంటూ వేలూ చూపిస్తూ హెచ్చరిక
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై అనుచిత వ్యాఖ్యలు
- అంత జరుగుతున్నా మౌనంగానే సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): 'ఏయ్.. మూస్కోవోయ్.. నీయమ్మ.. బయట కూడా తిరగ నియ్యం.. నా కొడనా మిమ్మల్ని.. ఏమనుకుంటున్నారా మీరు.. ఏయ్ తోలు తీస్తా కొడకా ఒక్కొక్కనిది.. తోలుతీస్తా ఒక్కొక్కనిది.. తొక్కుతా.. తోలుతీస్తా.. ఏమ్.. అరేయ్.. బయటకూడా తిరగ నియ్యం చెప్పున్నా. రేయ్ రారా.. రా.. నీయమ్మ ఏం మాట్లాడుతున్నవ్?' ఇవీ ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసెంబ్లీలో మాట్లాడిన బండ బూతులు. హైదరాబాద్ అభివృద్ధిపై జరుగుతున్న లఘు చర్చలో మాట్లాడేందుకు ఎమ్మెల్యే దానం నాగేందర్‌కు స్పీకర్ గడ్డం ప్రసాద్ అవకాశం ఇచ్చారు. అయితే, అప్పటికే జాబ్ క్యాలెండర్‌పై మాట్లాడే అవకాశం ఇవ్వాలని పోడియంను చుట్టుముట్టి ఆందోళన చేస్తున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు.. దానం నాగేందర్ ఏ పార్టీ నుంచి మాట్లాడుతున్నారో స్పష్టం చేయాలని స్పీకర్‌ను కోరారు. 'ఆయన ఏ పార్టీయో సభలోనే చెప్పాలి' అంటూ కేటీఆర్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, కేపీ వివేకానంద, పాడి కౌశిక్‌రెడ్డి, అనిల్‌జాదవ్, రాజశేఖర్‌రెడ్డి తదితరులు డిమాండ్ చేశారు. దీంతో దానం నాగేందర్ నోటికి వచ్చినట్టు బండ బూతులు తిడుతూ ఊగిపోయారు. చైర్ నుంచి స్పీకర్ వద్దని వారిస్తున్నా.. ఆగ్రహంతో ఊగిపోతూ నోరు అదుపు తప్పి మాట్లాడారు.

'దమ్ముంటే సభ బయటికి రా..'

దానం నాగేందర్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. 'నీకు దమ్ముంటే సభ బయటికి రా చూసుకుందాం' అంటూ సవాల్ చేశారు. 'ఏం రా.. ఏం..' అంటూ దానం నాగేందర్ ముందుకు రావడంతో.. ప్రతిగా బీఆర్ఎస్‌కు చెందిన ఎమ్మెల్యేలు ముందుకొచ్చారు. సభలో రగడ మొదలవుతుండటం, దానం నాగందేర్ నోరు అదుపు తప్పుతుండటంతో కాంగ్రెస్ ఎమ్మెల్యేలు అతనికి రక్షణగా వెళ్లారు. విప్ ఆది శ్రీనివాస్‌తోసహా 14 మంది ఎమ్మెల్యేలు ఆ వ్యాఖ్యలను ఖండించకపోగా దానం నాగేంద్‌కు అండగా నిలిచారు. ప్రతిగా కాంగ్రెస్ నుంచి ఎమ్మెల్యేలంతా రన్నింగ్ కామెంట్రీతో గట్టిగా నినాదాలు చేశారు. దానం నాగేందర్‌కు కుడిపక్కన ముగ్గురు, వెనుక ముగ్గురు, ఎడమ పక్కన 8 మంది ఎమ్మెల్యేలు వరసగా నిలుబడి అతనికి మద్దతు తెలిపారు. బీఆర్ఎస్ యువ ఎమ్మెల్యేలను కేటీఆర్ వారించి వెనక్కి తీసుకెళ్లారు. అటు నిరుద్యోగులపై, ఇటు దానం దురహంకార వ్యాఖ్యలపై మాట్లాడేందుకు స్పీకర్ అవకాశం ఇవ్వకపోవడంతో 'షేమ్.. షేమ్..' అంటూ నినాదాలు చేసుకుంటూ సభ నుంచి వాకౌట్ చేశారు. అయితే, ఇరు పార్టీల ఎమ్మెల్యేల మధ్య బాహాబాహీ జరుగుతున్నా.. సభలోనే ఉన్న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఎవ్వరినీ వారించే ప్రయత్నం చేయలేదు. సభా నాయకుడే అలా చూస్తూ ఉండిపోయారు. సభలో గందరోగళం ఏర్పడటంతో హుటాహుటిన 15 మంది మార్షల్స్‌ను రంగంలోకి దించారు.

అసభ్యకరమైన భాష: అక్బరుద్దీన్

నిండు సభలో కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్ అసభ్యకరమైన పదజాలం ఉపయోగించారని, అది తాను రిపీట్ చేయదలచుకోలేదని ఎంఐఎం ఎమ్మెల్యే అక్బరుద్దీన్ అన్నారు. ఎవరు రెచ్చగొట్టారు? ఎవరిది తప్పు? అనేది తాను ప్రస్తావించడం లేదని, ఆ తప్పు జరిగింది కాబట్టి.. ఒక సీనియర్ సభ్యుడిగా ఆయన క్షమాపణ చెప్పాలని అక్బరుద్దీన్ కోరారు. 'నన్ను మీరు ఎన్నో ఏండ్లుగా చూస్తున్నారు. అనుకోకుండా అలా జరిగింది. సభలో నేను మాట్లాడే విధానమేందో అందరికీ తెలుసు. ఆ మాటలకు నేను చింతిస్తున్నా. హైదరాబాద్‌లో నీయమ్మ, మాయమ్మ అనేది కామన్' అని దానం నాగేందర్ చెప్పారు. అయితే, దానం నాగేందర్ వాడిన పదాలను సభా రికార్డులను పరిశీలించి తొలగిస్తామని స్పీకర్ గడ్డం ప్రసాద్ చెప్పారు.

దానం.. నాలుక చీరేస్తం: పడాల

బీఆర్ఎస్ నాయకులపై అతిగా మాట్లాడితే సహించేది లేదని, నాలుక చీరేదస్తామని బీఆర్ఎస్‌వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ హెచ్చరించారు. 'బార్ ముందు రాత్రి పూట బీడీలు అమ్ముకొన్న.. ఏ ఎండకు ఆ గొడుగు పట్టే నువ్వు కూడా మాట్లాడవడితివి' అంటూ ఎద్దేవా చేశారు.

శాసనసభ కాదది.. దుశ్శాసన సభ!

- ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్ ప్రభుత్వం శాసనసభను దుశ్శాసన సభగా మార్చేసిందని ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ ఒక ప్రకటనలో మండిపడ్డారు. ముఖ్యమంత్రి దుర్యోధనుడి వలె వికటాట్టహాసం చేస్తూ సైగలు చేస్తుంటే ఖైరతాబాద్ ఎమ్మెల్యే దానం నాగేందర్ దుశ్శాసనుడిలా చెలరేగిపోయాడని ఆగ్రహం వ్యక్తం చేశారు. సభ్యసమాజం సహించరాని భాషను శాసనసభలో దానం నాగేందర్ ఉపయోగిస్తుంటే స్పీకర్ మైక్ కట్ చేయకపోగా యథేచ్ఛగా మాట్లాడటానికి అవకాశం ఇచ్చారని ఆవేదన వ్యక్తం చేశారు. పురుషాహంకారం, ప్యూడల్ అహంకారం కలిస్తే కాంగ్రెస్ పాలన అని ధ్వజమెత్తారు.

కేంద్ర చట్టాలతో పోలీస్‌రాజ్యమే

- నిరసన దీక్ష చేసినా నేరమే
- సవరణ కోసం రాష్ట్రాల డిమాండ్
- తెలంగాణ ఆ దిశగా దృష్టి పెట్టాలి
- సమిష్టిగా చర్చించి విధాన నిర్ణయం తీసుకోవాలి
- 'తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లు'పై చర్చలో కేటీఆర్
- కేంద్ర చట్టాలపై అధ్యయనం చేస్తున్నాం: శ్రీధర్‌బాబు



తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లుపై అసెంబ్లీలో మాట్లాడుతున్న కేటీఆర్

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన న్యాయ సంహిత తదితర నూతన చట్టాలతో పోలీసు రాజ్యం నడుస్తుందంటూ ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయని, నిరసన దీక్ష చేపట్టినా నేరమయ్యే పరిస్థితి ఉన్నదని బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఆందోళన వ్యక్తంచేశారు. ఆ చట్టాలపై ప్రభుత్వం ఆలోచించి విధాన నిర్ణయం తీసుకోవాలని సూచించారు. అసెంబ్లీలో శుక్రవారం ఆయన 'తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లు'పై మాట్లాడారు. ప్రభుత్వం తెచ్చిన 'తెలంగాణ సివిల్ కోర్ట్స్ అమెండ్‌మెంట్ బిల్లు'కు బీఆర్ఎస్ తరపున మద్దతు ప్రకటించారు. శాంతిభద్రత విషయంలో రాజకీయాలకు అతీతంగా సమిష్టిగా ఆలోచించాల్సిన అవసరం ఉన్నదని పేర్కొన్నారు. లైంగికదాడులు, సైబర్‌క్రైమ్ నేరాలను విచారించేందుకు ఫాస్ట్‌ట్రాక్ కోర్టులను ఏర్పాటు చేయాలని, బాధితులకు న్యాయం చేయడంతోపాటు నిందితులకు శిక్ష పడుతుందన్న నమ్మకాన్ని కలిగించాలని సూచించారు. మరీ ముఖ్యంగా లైంగిక వేధింపులు, లైంగికదాడుల కేసుల్లో శిక్షలు వేగంగా పడేలా చర్యలు తీసుకోవాలని కోరారు. నేరాల ప్రవృత్తి మారుతున్నదని, అందుకు అనుగుణంగా చట్టాలను రూపొందించాల్సిన అవసరం ఉన్నదని నొక్కిచెప్పారు. సైబర్ నేరాల ద్వారా రూ.లక్షలు కోల్పోతున్నవారికి న్యాయం జరిగేలా ఫాస్ట్‌ట్రాక్ కోర్టులు ఉండాలని, జస్టిస్ డిలేడ్.. జస్టిస్ డినైడ్ అంటారని, అందుకే వీలైనంత వేగంగా న్యాయం చేసేలా చట్టాలు ఉండాలని కోరారు.

తెలంగాణ ప్రజా ఉద్యమాలకు అడ్డా

ఇటీవల కేంద్రం తీసుకొచ్చిన న్యాయ చట్టాలు తెలంగాణ రాష్ట్రానికి ఇబ్బందికరంగా మారే పరిస్థితి కనిపిస్తున్నదని కేటీఆర్ ఆందోళన వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్రం వామపక్ష, ప్రజాఉద్యమాలకు అడ్డా అని, కేంద్ర చట్టాలతో పోలీసు రాజ్యమవుతుందని ప్రజాసంఘాలు ఆందోళన వ్యక్తంచేస్తున్నాయని పేర్కొన్నారు. సోషల్ మీడియా, భావ ప్రకటన స్వేచ్ఛను హరించేలా చట్టం ఉన్నదని, ఆ చట్టం వస్తే పౌరులు తమ భావ ప్రకటన స్వేచ్ఛను కోల్పోయే ప్రమాదం ఉన్నదని హెచ్చరించారు. కర్ణాటక, పశ్చిమబెంగాల్, తమిళనాడు రాష్ట్రాలు ఈ చట్టంలో మార్పులు చేయాలంటున్నాయని గుర్తుచేశారు. డైరెక్ట్‌గా ఆ బిల్లుతో సంబంధం లేకున్నా తెలంగాణ ప్రభుత్వం కూడా విధానపరమైన నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని సూచించారు. అలాంటి బిల్లు ఏదైనా వస్తే మాత్రం మనమందరం కలిపి దానిని అడ్డుకోవాల్సి ఉన్నదని చెప్పారు.

సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టినా వేధింపులా?

సోషల్‌మీడియాలో వ్యక్తిత్వ హననం అందరి మీదా జరుగుతున్నదని కేటీఆర్ ఆవేదన వ్యక్తంచేశారు. దానికి ఒక పార్టీ మాత్రమే తప్పు చేస్తున్నదని, మిగతా పార్టీలు పునీతులు అన్నట్టు ఏమీ లేదని పేర్కొన్నారు. కాబట్టి ఆ అంశంపై కూడా అవసరమైతే చర్చ పెట్టాలని సూచించారు. సోషల్ మీడియాలో పోస్టులు పెట్టినా రాష్ట్రంలో కేసులు పెడుతున్నారని, పోస్టులు డిలీట్ చేయాలని ఒత్తిడి తెస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ప్రతిపక్షాలు సభలో మాట్లాడుతున్నప్పుడు లోపల విజువల్స్ చూపించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. బిల్లుపై ప్రసంగిస్తున్న సమయంలో కొండా సురేఖ తదితర మంత్రులు అడ్డుతగలగా ప్రతిపక్షాలు మాట్లాడుతుంటే, మంత్రులు రన్నింగ్ కామెంట్రీ చేస్తే ఎలా? అని కేటీఆర్ ప్రశ్నించారు. పార్లమెంట్‌లో జరిగే నిరసనలన్నీ వీడియోలు, ఫొటోలు తీస్తున్నారని గుర్తుచేశారు. ఇటీవల అసెంబ్లీకి సంబంధించిన వీడియోలను కొందరు వ్యక్తులు చిత్రీకరించిన తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉన్నదని, అది దుర్మార్గపు చర్య అని, అలాంటి వాటిని ఉపేక్షించేది లేదని తేల్చిచెప్పారు. దానిపైనా, సభలో భాషపై కూడా విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఉద్వేగాలను అదుపులో పెట్టుకోవాలి

సభలో మైక్‌ను అందరికీ ఇవ్వాలని, ముఖ్యమంత్రి నుంచి సభ్యుల వరకు మాట్లాడేప్పుడు ఉద్వేగాన్ని అదుపులో పెట్టుకుని భాషని ఉపయోగించాలని కేటీఆర్ సూచించారు. ఇటీవల సభలో జరిగిన సంఘటనలు పునరావృతం కాకుండా చూసుకోవాలని కోరారు. ప్రొఫెసర్ జయశంకర్ అగ్రికల్చర్ యూనివర్సిటీకి సంబంధించిన 100 ఎకరాల భూమిని హైకోర్టు భవన నిర్మాణానికి కేటాయించడంపై ప్రభుత్వం పునరాలోచించాలని విజ్ఞప్తి చేశారు. యూనివర్సిటీ విద్యార్థుల ఆందోళనలను సభకు వివరించారు. వ్యవసాయ వర్సిటీలో పరిశోధనల కోసం భూమి కావాల్సి ఉంటుందని తెలిపారు. హైకోర్టు భవనాన్ని మరో చోట నిర్మించాలని సూచించారు.

వీడియోలు మార్ఫింగ్‌చేస్తే చర్యలు తీసుకోవాలి: మంత్రి పొన్నం

సోషల్‌మీడియాలో వస్తున్న ఫేక్ వీడియోలపై కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉన్నదని రోడ్డు రవాణా, బీసీ సంక్షేమ శాఖల మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు. మహిళలకు ఉచిత బస్సు రవాణా సదుపాయంపై కొందరు కావాలనే వీడియోలు క్రియేట్ చేసి మహిళలను అవమానిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. సభలో తాను, మంత్రి సీతక్క మాట్లాడుతున్న వీడియోలను కూడా ఎడిట్ చేసి వైరల్ చేశారని, అలాంటి వారిపై పోలీసులు చర్యలు తీసుకోవాలని కోరారు. 'తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లు'పై చర్చ సందర్భంగా పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ.. ప్రతి ఒక్కరికీ భావ ప్రకటన స్వేచ్ఛ ఉండాలని, కానీ అది ఎదుటి వ్యక్తిని అవమానించే విధంగా ఉంటే ఎట్లా? అని ప్రశ్నించారు. సభలో జరిగిన అంశాలను కించపరిచి, అవమానపరిచేలా వీడియోలు చేస్తున్నవారిపై చర్యలు తీసుకోవాలని స్పీకర్‌ను కోరారు.

నిర్బంధం గత ప్రభుత్వంలోనూ లేదు: సీఐపీ ఎమ్మెల్యే కూనంనేని

గత ప్రభుత్వ హయాంలో లేని నిర్బంధాన్ని ప్రజలు ప్రస్తుతం చవిచూడాల్సి వస్తున్నదని సీపీఐ ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ఆవేదన వ్యక్తంచేశారు. కోర్టుల వ్యవస్థను పటిష్టపరచాలని, ఎక్కువ మంది జడ్జీలను నియమించాలని, అప్పుడే అపరిష్కృత కేసుల సంఖ్య తగ్గిపోతుందని పేర్కొన్నారు. రాష్ట్రంలో పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నారని, అనధికారికంగా నిర్బంధాన్ని ప్రయోగిస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. ధర్నాచౌక్ ఉద్యమాలను అణచివేస్తున్నారని మండిపడ్డారు. ఆఖరికి పుస్తకావిష్కరణ సభల నిర్వహణకు సైతం అనుమతి తీసుకోవాలని హుకూం జారీ చేశారని, గత ప్రభుత్వంలోనూ ఇలాంటి నిర్బంధం చూడలేదని స్పష్టంచేశారు. ప్రభుత్వం వెంటనే స్పందించి వీటిపై దృష్టి సారించాలని, భావ ప్రకటన స్వేచ్ఛకు అవకాశమివ్వాలని డిమాండ్ చేశారు.

భంగంకలితే ఉపేక్షించం: మంత్రి దుద్దిళ్ల

శాంతిభద్రతలపై పరిధి దాటితే కఠిన చర్యలు తీసుకోకతప్పదని శాసనసభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు హెచ్చరించారు. 'తెలంగాణ సివిల్ న్యాయస్థానాల సవరణ బిల్లు'పై సభ్యులు లేవనెత్తిన అంశాలపై శ్రీధర్‌బాబు సమాధానమిచ్చారు. బాధితులకు సత్వర న్యాయం అందించేందుకే కోర్టులు, జడ్జీల ద్రవ్య అధికార పరిధిని విస్తరిస్తూ బిల్లుకు సవరణలు చేశామని వివరించారు. కేంద్ర చట్టాలపై అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. సైబర్ క్రైమ్స్‌ను ఏవిధంగా అదుపు చేయాలనే అంశంపై దృష్టి సారించామని తెలిపారు. బిల్లుకు మద్దతు తెలిపిన అన్ని పార్టీలకు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

మార్ఫింగ్ వీడియోలపై చర్యలు తీసుకుంటాం: స్పీకర్

అసెంబ్లీలో సభ్యులు, మంత్రులు మాట్లాడిన వీడియోలను మార్ఫింగ్ చేసి వైరల్ చేస్తున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని మంత్రులు దుద్దిళ్ల శ్రీధర్‌బాబు, పొన్నం ప్రభాకర్‌తోపాటు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, ఇతర సభ్యులు విజ్ఞప్తి చేయగా స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ వెంటనే స్పందించారు. వీడియోలను మార్ఫింగ్‌చేసి వైరల్ చేసిన ఘటనపై విచారణ జరపాలని, బాధ్యులను గుర్తించాలని నిర్ణయించారు. ఆపై కఠిన చర్యలు కూడా తీసుకుంటామని చెప్పారు.

సీఎం రేవంత్‌రెడ్డిపై సభాహక్కుల నోటీస్

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): సీఎం రేవంత్‌రెడ్డిపై బీఆర్ఎస్ శాసనసభా పక్షం సభాహక్కుల ఉల్లంఘన నోటీసులు ఇచ్చింది. విద్యుత్తు మీటర్ల విషయంలో సభను తప్పుదోవ పట్టించినందుకు, మహిళా ఎమ్మెల్యేలను కించపరిచేలా మాట్లాడినందుకు సీఎం రేవంత్‌రెడ్డిపై సభా హక్కుల ఉల్లంఘన కింద చర్యలు తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను శాసనసభాపక్షం కోరింది. శుక్రవారం శాసనసభలో స్పీకర్‌ను కలిసి వినతి పత్రం సమర్పించింది. ఈనెల 27న శాసనసభలో బడ్జెట్‌పై జరిగిన చర్చ సందర్భంగా విద్యుత్తు మీటర్ల విషయంలో ఉద్దేశపూర్వకంగా తప్పుడు సమాచారం ఇచ్చి గత బీఆర్ఎస్ ప్రభుత్వ ప్రతిష్ఠకు భంగం కలిగేలా వ్యవహరించినందుకు సభహక్కుల ఉల్లంఘన నోటీసు ఇస్తున్నట్టు తెలిపింది. విద్యుత్తు మీటర్ల విషయంలో 2017లో జరిగిన ఒక ఒప్పంద పత్రాన్ని తీసుకొచ్చి, అందులోని కొన్ని పదాలు మాత్రమే చదివి, మరి కొన్ని పదాలు ఉద్దేశపూర్వకంగా వదిలేశారని తెలిపారు. దీంతోపాటు బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేలపై సీఎం అభ్యంతరకర వ్యాఖ్యలపైనా శాసనసభ నియమావళి 168 (1) ప్రకారం సభాహక్కుల ఉల్లంఘన నోటీస్ ఇస్తున్నామని తెలిపారు. స్పీకర్‌ను కలిసిన ఫిర్యాదు చేసినవారిలో బీఆర్ఎస్ మాజీ మంత్రులు, ఎమ్మెల్యేలు హరీశ్‌రావు, వేముల ప్రశాంత్‌రెడ్డి, గంగుల కమలాకర్, కొత్త ప్రభాకర్‌రెడ్డి, చింత ప్రభాకర్, విజయుడు, అనిల్ జాదవ్ ఉన్నారు.

ఆ ఎమ్మెల్సీలపై అనర్హత వేటు వేయండి

- మండలి చైర్మన్‌కు బీఆర్ఎస్ ఎమ్మెల్సీల పిటిషన్

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): కాంగ్రెస్‌లో చేరిన భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) శాసనమండలి సభ్యులు టీ భానుప్రసాద్, ఎంఎస్ ప్రభాకర్ రావు, దండే విఠల్, యెగ్గె మల్లేశంపై అనర్హత వేటు వేయాలని కోరుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్సీలు శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డికి పిటిషన్ సమర్పించారు. వారిలో మండలి ప్రతిపక్ష నేత మధుసూదనాచారీ, ఎమ్మెల్సీలు మహమూద్ అలీ, వాణిదేవి, శేరి శుభాష్‌రెడ్డి, ఎల్ రమణ, దేశపతి శ్రీనివాస్, రవీందర్‌రావు, తాతా మధుసూదన్, నవీన్ కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

క్రీడా పాలసీ తెస్తం

- శాసనసభలో సీఎం రేవంత్‌రెడ్డి

హైదరాబాద్, ఆగస్టు2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో త్వరలోనే క్రీడా పాలసీని తీసుకువస్తామని, దానికోసం పలు రాష్ట్రాల పాలసీలను అధ్యయనం చేస్తున్నామని సీఎం రేవంత్‌రెడ్డి అసెంబ్లీలో వెల్లడించారు. 2024 పబ్లిక్ సర్వీసుల నియామకాల క్రమబద్ధీకరణ బిల్లుపై జరిగిన చర్చలో భాగంగా బాక్సర్ నిఖత్ జరీన్, క్రికెటర్ మహ్మద్ సిరాజ్‌కు ఉద్యోగాలు ఇవ్వటంపై సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలని బడ్జెట్‌లో రూ.321కోట్లు కేటాయించిందని తెలిపారు. హర్యానా, పంజాబ్ తదితర రాష్ట్రాల పాలసీలను అధ్యయనం చేసి మంచి పాలసీని రూపొందించి వచ్చే అసెంబ్లీ సమావేశాల్లో ప్రవేశపెడతామని వెల్లడించారు. మండల కేంద్రాల్లో భూములు అందుబాటులో ఉంటే స్టేడియం నిర్మించడానికి ప్రభుత్వానికి ఎలాంటి అభ్యంతరం లేదని, బ్యాగరికంచెలో అంతర్జాతీయ క్రికెట్ స్టేడియం నిర్మించేందుకు బీసీసీఐతో ప్రాథమిక చర్చలు పూర్తయ్యాయని, వారూ సానుకూలంగా స్పందించారని తెలిపారు. కొద్దిరోజుల్లోనే అందుకు భూమిని కేటాయిస్తామని వివరించారు. క్రీడల విషయంలో నిధుల కేటాయింపుతోపాటు ప్రత్యేక కార్యాచరణతో ముందుకెళతామని, ఎవరు సలహాలు ఇచ్చినా స్వీకరిస్తామని అన్నారు. హైదరాబాద్‌లో గతంలో నిర్మించిన స్టేడియాలు ప్రైవేట్, రాజకీయ కార్యక్రమాలకే పరిమితమయ్యాయమని, వాటన్నింటినీ అప్‌గ్రేడ్ చేసి విద్యార్థులకు క్రీడలపై ఆసక్తిని పెంచాల్సిన అవసరమున్నదని, ప్రభుత్వం ఆ బాధ్యత తీసుకోవాలనుకుంటున్నదని, అందుకు అందరూ మద్దతివ్వాలని కోరారు.డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క మాట్లాడుతూ తెలంగాణ ఖ్యాతిని అంతర్జాతీయస్థాయిలో చాటుతున్న క్రీడాకారులను సముచితంగా గౌరవించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నదని, అందుకే క్రికెటర్ సిరాజ్‌కు, బాక్సర్ నిఖత్ జరీన్‌కు డీఎస్పీగా ఉద్యోగం కల్పిస్తున్నామని వెల్లడించారు. ఈ సవరణ బిల్లుకు పార్టీలకతీతంగా సభ్యులందరూ మద్దతు తెలిపారు.

గ్రామీణ క్రీడా ప్రాంగణాలను కొనసాగించాలి: కేటీఆర్

నిఖత్ జరీన్, మహ్మద్ సిరాజ్‌కు ప్రభుత్వ సాయాన్ని స్వాగతిస్తున్నామని కేటీఆర్ తెలిపారు. స్పోర్ట్స్ పాలసీ తీసుకొస్తామన్న సీఎం వ్యాఖ్యల్ని స్వాగతిస్తున్నామని, ఆ పాలసీ తీసుకొచ్చినప్పుడు తమ వంతుగా సూచనలు కూడా ఇస్తామని అన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం తెలంగాణలోని ప్రతి గ్రామంలో తెలంగాణ గ్రామీణ క్రీడా ప్రాంగణాలను ఏర్పాటు చేసిందని, వీటిని కొనసాగించాలని ప్రభుత్వాన్ని కోరారు.

తెలుగు వర్సిటీకి సురవరం పేరు: సీఎం

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోని అన్ని పార్టీలకు అతీతంగా అంగీకరిస్తే పొట్టి శ్రీరాములు తెలుగు యూనివర్సిటీకి తెలంగాణ వైతాళికుడు, ఉద్యమకారుడు సురవరం ప్రతాపరెడ్డి పేరు పెడతామని, అందులో తమ ప్రభుత్వానికి ఎలాంటి భేషజాలు లేవని అసెంబ్లీలో సీఎం రేవంత్‌రెడ్డి స్పష్టం చేశారు. కేటీఆర్ మాట్లాడుతూ.. సురవరం ప్రతాప్‌రెడ్డిపై తమ పార్టీ పెద్ద కేసీఆర్‌కు ఎనలేని గౌరవం ఉన్నదని, అందుకే తెలుగు విశ్వవిద్యాలయానికి సురవరం పేరు పెట్టాలని నిర్ణయించారని గుర్తుచేశారు. పదేండ్లపాటు యూనివర్సిటీ విభజన జరగలేదని, అందుకే పేరు పెట్టలేకపోయామని వివరించారు. పదేండ్లు గడిచి, విభజన జరిగినందున యూనివర్సిటీకి సురవరం పేరు పెట్టాలని సూచించారు. తెలంగాణ సంక్షిప్త పదాల మార్పు బిల్లును స్వాగతిస్తూనే ప్రభుత్వానికి బీజేపీ, ఎంఐఎం చురకలు అంటించాయి. ప్రభుత్వం పేర్లు మార్చటంపైనే కాకుండా ప్రజలకు పనికివచ్చే అంశాలపై ఎక్కువగా దృష్టిసారించాలని సూచించాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే గత బీఆర్ఎస్ ప్రభుత్వం అమలు చేసిన పథకాల పేర్లను మార్చిందని, ఆసరా పింఛన్లకు చేయూత, దళితబంధుకు అంబేద్కర్ అభయహస్తం అని పెట్టిందని ఉదహరించారు.

సీఎంను కలిసిన వకుళాభరణం

తాము కోరిన సమాచారాన్ని వెంటనే అందించి సహకరించేలా ఆయా ప్రభుత్వ విభాగాలకు ఆదేశాలు జారీ చేయాలని తెలంగాణ బీసీ కమిషన్ చైర్మన్ డాక్టర్ వకుళాభరణం కృష్ణమోహన్‌రావు సీఎం రేవంత్‌రెడ్డిని కోరారు. శుక్రవారం అసెంబ్లీలో సీఎంను కలిసి విజ్ఞప్తి చేశారు. రాష్ట్రంలో త్వరలో నిర్వహించబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీ రిజర్వేషన్లకు కమిషన్ కసరత్తు చేస్తున్నది. ఉదయం గద్వాల ఎమ్మెల్యే కృష్ణమోహన్‌రెడ్డి కూడా సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు.

త్వరలో కొత్త రెవెన్యూ చట్టం

- అందరి సూచనలు, సలహాలతో ముసాయిదా రూపొందిస్తాం
- ఇప్పటికే రెండు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలు
- అసెంబ్లీలో మంత్రి పొంగులేటి వెల్లడి
- భూ వివాదాల పరిష్కారానికే ధరణి: పల్లా రాజేశ్వర్‌రెడ్డి
- మళ్లీ దళారుల రాజ్యం తెస్తామంటే సహించబోమని హెచ్చరిక

హైదరాబాద్, ఆగస్టు 2 (నమస్తే తెలంగాణ): వివాదాలకు ఆస్కారం లేని నూతన రెవెన్యూ చట్టాన్ని(ఆర్వోఆర్) త్వరలో ప్రవేశపెట్టనున్నట్టు రెవెన్యూ శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి వెల్లడించారు. తాము ప్రతిపాదించనున్న చట్టాన్ని ఇప్పటికే రెండు మండలాల్లో ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నట్టు తెలిపారు. అందరి అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకొని నూతన చట్టాన్ని రూపొందిస్తామని చెప్పారు. గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్ లోపభూయిష్టంగా ఉన్నదని, దానివల్ల రైతులు నానా ఇబ్బందులు పడుతున్నారని విమర్శించారు. దీనిపై బీఆర్ఎస్ సభ్యుడు పల్లా రాజేశ్వర్‌రెడ్డి స్పందిస్తూ, భూ వివాదాలు లేకుండా చేసేందుకు, భూ వ్యవహారాల్లో పారదర్శకత తెచ్చేందుకే గత కేసీఆర్ ప్రభుత్వం ధరణి పోర్టల్‌ను తెచ్చినట్టు చెప్పారు. దీన్ని రద్దుచేసి మళ్లీ దళారుల రాజ్యం తెస్తామంటే సహించేది లేదని హెచ్చరించారు. మంత్రి పొంగులేని శ్రీనివాస్‌రెడ్డి శుక్రవారం తెలంగాణలో భూ హక్కులు – భూ సంస్కరణలపై శాసనసభలో చర్చను ప్రారంభిస్తూ, గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన ధరణి పోర్టల్‌ను నిశితంగా విమర్శించారు. 2020 అక్టోబర్‌లో కేసీఆర్ ప్రభుత్వం తెచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులకు భూసమస్యలు మొదలయ్యాయని చెప్పారు. ఇది పూర్తిగా అవినీతితో కూడుకున్న చట్టమని, ఇద్దరు వ్యక్తులు కలిసి నాలుగు గోడల మధ్య కుట్రపూరితంగా దీన్ని రూపొందించారని ఆరోపించారు. రాష్ట్రంలో అనేక ప్రపంచ ప్రఖ్యాత ఐటీ కంపెనీలు, డాటా సెంటర్లు ఉన్నప్పటికీ ధరణి పోర్టల్ నిర్వహణ బాధ్యతను సింగపూర్‌కు చెందిన కంపెనీకి అప్పగించారని విమర్శించారు. వీఆర్ఏ, వీఆర్‌వోల వ్యవస్థను రద్దు చేయడంతో 10,954 గ్రామాల్లో రెవెన్యూకు సంబంధించిన ఒక్క ఉద్యోగి కూడా లేకుండా పోయారని విమర్శించారు. భూ రికార్డుల ప్రక్షాళన సమయంలో